## విజయీభవ..

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఆనందంగా జరుపుకొనే పండుగ దసరా. జగత్తుకు మూలం.. త్రిమూర్తులకు శక్తిప్రదాత.. త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని దుర్గామాత దుష్ట శిక్షణ చేసిన రోజు విజయదశమి. చేసే ప్రతిపనిలోనూ విజయం సాధించాలని కోరుకుంటూ శమీవృక్షాన్ని పూజించడం సంప్రదాయం. ఇలాంటి దసరా రోజు యంత్ర, వాహన, పనిముట్లకు పూజలు చేయడం ఆనవాయితీ. నేడు విజయదశమి..



## న్యూస్‌రీల్

### 'అన్యాయం చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న కొంకటి లక్ష్మీనారాయణ

గోదావరిఖని: ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆదివారం ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. సీఎం కేసీఆర్ తనకు గొప్ప అకాశం ఇచ్చారని, దళితుల చైతన్యం కోసం, వారిహక్కుల సాధన కోసం తన అధికారం వినియోగిస్తానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులకు సూచిస్తామని అన్నారు. నాయకులు బొంకూరి మధు, న్యాతరి రాయమల్లు, మామిడిపల్లి బాపయ్య, కొంకటి లక్ష్మణ్, మైస రాజేశ్, కాంపల్లి సతీశ్, మంతెన లింగయ్య, అడకపురం చంద్రమౌళి, ఇరుగురాల కృష్ణయ్య, బాలంకూస్ పాల్గొన్నారు.

### 'లైట్ల ఏర్పాటులో కక్షసాధింపు'

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో బతుకమ్మ ఆడటానికి కూడళ్లలో ఏర్పాటు చేసే ఎల్‌ఈడీ లైట్ల బిగింపులో ఓ అధికారి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, తనకు పనులు దక్కకుండా మానసిక ఇబ్బందులకు గురిచేశారని జె.విశ్వతేజ అనే కాంట్రాక్టర్ ఆదివారం అడిషనల్ కలెక్టర్‌అరుణశ్రీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటుకు డ్రా పద్ధతి ద్వారా తనతోపాటు మరికొందరు కాంట్రాక్టర్లను ఎంపిక చేశారని, కానీ తనకు మాత్రం వర్క్ సైట్ చూపించకుండా మిగతా వారికి పనులు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మిగతా కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారని, అందుకు తనకు పనులు అప్పగించలేదని ఆరోపించారు. అతినీతికి పాల్పడడం కోసమే ఓ అధికారి తనపై కక్షపూరితంగా పనులు అప్పగించలేదని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు




స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఆర్డీవో హనుమానాయక్

రామగిరి: మంథని నియోజకవర్గానికి సరిపడా ఈవీఎంలు జేఎన్టీయూకు చేరాయని ఆర్డీవో హనుమానాయక్ తెలిపారు. స్థానిక జేఎన్టీయూలోని స్ట్రాంగ్‌రూమ్‌లో వాటిని భద్రపర్చామన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన స్ట్రాంగ్‌రూమ్‌లు పరిశీలించారు. ఈవీఎంల భద్రత కోసం 24 గంటల పాటు పోలీసు పహారా కాస్తున్నారని పేర్కొన్నారు. వీటి తరలింపు ప్రక్రియలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్లు పాల్గొన్నారని వివరించారు.

### తొలగిన ప్రచార పటం



పీఏసీఎస్ కార్యాలయం

మంథని: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి ఫొటో, కటౌట్‌ను అధికారులు ఆదివారం తొలగించారు. 'కోడ్ కూసినా.. తొలగని ప్రచార పటం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

### 19 కేసులు.. రూ.36.25లక్షలు

మంథని: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో తగిన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.36.25లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్డీవో హనుమానాయక్ తెలిపారు. మొత్తం 19 కేసుల్లో రూ.36,25,860 సీజ్‌చేశామన్నారు. ముగ్గురు కమిటీ సభ్యుల నివేదిక,, పరిశీలన అనంతరం రిలీజ్ ఆర్డర్ జారీచేసిన 12 కేసుల్లో రూ.27,62,510 నగదును అధికారుల ద్వారా సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు పేర్కొన్నారు. డీజే సౌండ్ బాక్స్‌లు, స్పీకర్లకు ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఆర్డీవో వివరించారు. ఎన్నికల కమిషన్ సూచించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. నియమావళిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హనుమానాయక్ ఈ సందర్భంగా హెచ్చరించారు.



గోదావరిఖనిలో సింగరేణి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



పెద్దపల్లి మినీ ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు





జ్యోతినగర్ : ఎన్టీపీసీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోదావరిఖనిలో..





కోలాటం ఆడుతున్న మహిళ, బతుకమ్మతో చిన్నారి



యైటింక్లయిన్‌కాలనీలో..





రామగుండంలో..

## పూలవైభవం.. సద్దుల సంబురం

'ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయె చందమామ' అంటూ.. తీరొక్క పూలతో తెలంగాణ పల్లెవాకిట్ల సాగిన బతుకమ్మ సంబురాలు ఆదివారం జరిగిన సద్దుల బతుకమ్మ ఉత్సవంతో ముగిశాయి. బొడ్డెమ్మతో ప్రారంభమై.. ఎంగిలి పూలతో జోరుగా సాగిన పూలపండుగ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సందడిగా నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచే పూలసేకరణలో నిమగ్నమయ్యారు. నూతన వస్త్రాలు, నగలు ధరించి ప్రధాన కూడళ్లకు చేరి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ, పాటలు పాడారు. ఆటలు ఆడారు. సమీప జలవనరుల్లో నిమజ్జనం చేశారు. 'పోయిరా గౌరమ్మ.. మళ్లీ రావమ్మా' అని వీడ్కోలు పలికారు.

– సాక్షి,పెద్దపల్లి/గోదావరిఖని/సాక్షిఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





దుర్గామాత బతుకమ్మ, బతుకమ్మను ఎత్తుకుంటున్న మహిళ



సుల్తానాబాద్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోదావరిఖనిటౌన్ : బతుకమ్మతో ఎమ్మెల్యే కోరుకంటి చందర్



పెద్దపల్లిరూరల్ : బతుకమ్మ ఆడుతున్న భోజన్నపేట గ్రామ మహిళలు



పెద్దపల్లిలో వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు



గోదావరిఖని : బతుకమ్మలతో సెల్ఫీ..



పెద్దపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు



పెద్దపల్లిలో బతుకమ్మతో తల్లీకూతుళ్లు



బతుకమ్మ వద్ద ఎమ్మెల్యే దాసరి, మమతారెడ్డి



నిమజ్జనం కోసం బతుకమ్మను తీసుకెళ్తూ..

# బరిలో బండి.. ఈటల.. అర్వింద్

- ఉమ్మడి జిల్లా నుంచే సీఎం అభ్యర్థులు..!
- బీసీ సీఎం నినాదంతో అనుచరుల్లో ఉత్సాహం
- తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన కమలం
- హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండుచోట్ల బరిలో రాజేందర్
- 19 ఏళ్ల తరువాత రెండు స్థానాలకు కరీంనగర్ నేత పోటీ

జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ బరిలో నిలిచే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలు ఉండగా.. తొమ్మిది స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. తొలిజాబితా అభ్యర్థులకు శనివారం రాత్రే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫోన్ చేసి పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినా అధికారికంగా ప్రకటించేవరకూ ఈ విషయాన్ని ఎవరూ వెల్లడించలేదు. 2018 ఎన్నికలతో పోల్చితే నాయకుల విషయంలో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు స్థానాల్లో ప్రాతినిధ్యం కరవవడం.. లేదా పొత్తులతో సాగే చరిత్ర ఉన్న బీజేపీ తాజాగా బలోపేతమైంది. ప్రస్తుతం ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు, ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే, అలాగే మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే బరిలో ఉండటం గమనార్హం.

**పార్టీ ప్రకటించింది వీరినే..**

- కోరుట్లకు ధర్మపురి అరవింద్, జగిత్యాలకు భోగ శ్రావణి, ధర్మపురికి ఎస్.కుమార్, చొప్పదండికి బొడిగె శోభ, రామగుండంకు కందుల సంధ్యారాణి, సిరిసిల్లకు రాణీ రుద్రమదేవి, కరీంనగర్‌కు బండి సంజయ్, మానకొండూరుకు ఆరెపల్లి మోహన్, హుజూరాబాద్‌కు ఈటల రాజేందర్ పేర్లను పార్టీ ప్రకటించింది. ఈటల తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌తోపాటు ప్రస్తుతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి కూడా బరిలోకి దిగనుండటం విశేషం. జిల్లా చరిత్రలో కేసీఆర్ తరువాత రెండుసార్లు బరిలోకి దిగుతున్న ఏకైక నాయకుడు ఈటల కావడం గమనార్హం. 2004లో కరీంనగర్ ఎంపీ, సిద్దిపేట అసెంబ్లీకి పోటీ చేసిన కేసీఆర్.. రెండుచోట్లా విజయం సాధించారు. తరువాత సిద్దిపేట స్థానానికి రాజీనామా చేశారు. దాదాపు 19 ఏళ్ల తరువాత కరీంనగర్ నుంచి రెండుచోట్ల అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుండటం విశేషం.

**ముగ్గురు సీఎం అభ్యర్థులు**

- బీసీ సీఎం నినాదంతో బీజేపీ ఈసారి ఎన్నికల బరిలోకి దిగే యోచనలో ఉంది. పార్టీలో బీసీ సీఎం అభ్యర్థి ప్రతిపాదన రాగానే.. ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల మధ్య పోటీ మొదలైంది. మరోవైపు తాను ఏమాత్రం తక్కువా..? అన్నట్లు కోరుట్ల అసెంబ్లీ నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రంగంలోకి దిగారు.
- బండి సంజయ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గంగుల కమలాకర్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించారు. ఆ తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టి బీజేపీకి ఊపు తెచ్చారు. దుబ్బాక, జీహెచ్‌ఎంసీ, హుజూరాబాద్ ఎన్నికల్లో బీజేపీని విజయతీరాలకు చేర్చారు. 8శాతం ఉన్న ఓటుబ్యాంకును అమాంతం పెంచారు. పార్టీ తరఫున బీసీ సీఎంగా తమ నాయకుడే ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా సంజయ్ అనుచరులు కోరుకుంటున్నారు.
- తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ వేదికగా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఈటల రాజేందర్ 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా, శాసనసభాపక్ష నేతగా పనిచేసిన అనుభవంతో రాజేందర్ సైతం పార్టీ సీఎం అభ్యర్థి అవుతారని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు.
- ఎలాగైనా అసెంబ్లీ బరిలో ఉండాలన్న పట్టుదలతో కొంతకాలంగా ధర్మపురి అర్వింద్ కోరుట్లలో చాపకింద నీరులా పనిచేసుకుంటూ వెళ్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్నారు. సంజయ్ కొత్త అభ్యర్థి కావడం, తాను ఎంపీగా ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోనే కోరుట్ల ఉండటం, తన అమ్మమ్మ ఊరు కావడం, సొంత సామాజికవర్గం సహకారం తదితరాల లెక్కలతో అర్వింద్ ఈసారి కోరుట్లపై కన్నేశారు.

### పోటీకి బండి, ఎస్.కుమార్ అనాసక్తి..

కేంద్రమంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో అసెంబ్లీకి పోటీ చేయాలని ఆదేశాలు రావడంపై బండి సంజయ్.. అసలు తనకు మాట మాత్రమైనా చెప్పకుండా ధర్మపురిలో పోటీ చేయాలని చెప్పడంపై ఎస్.కుమార్ అసంతృప్తితో ఉన్నారని సమాచారం.

### బండి సంజయ్



జన్మదినం: 11-07-1971
విద్యార్హతలు: గ్రాడ్యుయేషన్
స్వగ్రామం: కరీంనగర్
అనుభవం: 2005, 2014లో కార్పొరేటర్, 2014, 2018 ఎమ్మెల్యే స్థానానికి పోటీ, 2019 ఎంపీగా విజయం.
- అదనపు సమాచారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి, ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శి

సామాజిక వర్గం: మున్నూరుకాపు

### ఈటల రాజేందర్



జన్మదినం: 20-03-1964
విద్యార్హతలు: పీజీ (ఉస్మానియా)
స్వగ్రామం: కమలాపూర్ (ప్రస్తుతం హన్మకొండ జిల్లా)
అనుభవం: ఏడుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, శాసనసభ పక్షనేత
- అదనపు సమాచారం: 2021లో బీజేపీలో చేరిక. చేరికల కమిటీ చైర్మన్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్.

సామాజిక వర్గం: ముదిరాజ్

### ధర్మపురి అర్వింద్



జన్మదినం: 25-08-1976
విద్యార్హతలు: ఎంఏ.పొలిటికల్ సైన్స్
స్వగ్రామం: నిజామాబాద్
అనుభవం: 2019 నిజామాబాద్ ఎంపీ,
- అదనపు సమాచారం: కేంద్ర వాణిజ్య స్టాండింగ్ కమిటీ సభ్యులు

సామాజికవర్గం: మున్నూరుకాపు

### ఎస్.కుమార్



జన్మదినం: 10-10-1966
విద్యార్హతలు: ఎంసీజే, ఎల్‌ఎల్‌ఎం (ఉస్మానియా)
స్వగ్రామం: గోదావరిఖని
అనుభవం: రామగుండం మున్సిపాలిటీ చైర్మన్ 2004, 2009 ధర్మపురి ఎమ్మెల్యే స్థానానికి, 2019 పెద్దపల్లి ఎంపీ స్థానానికి పోటీ చేసిన అనుభవం
- అదనపు సమాచారం: జర్నలిస్టుగా అనేక అవార్డులు, బీజేపీ జాతీయస్థాయిలో పలు పదవుల నిర్వహణ.

సామాజికవర్గం: ఎస్సీ (మాల)

### బొడిగె శోభ



జన్మదినం: 1972
విద్యార్హతలు: పదవ తరగతి
స్వగ్రామం: వెంకటేశ్వర్లపల్లె, సైదాపూర్ మండలం
అనుభవం: 2001 శంకరపట్నం జెడ్పీటీసీ, 2014లో ఎమ్మెల్యే (బీఆర్ఎస్), 2018 ఎమ్మెల్యేగా ఓటమి.
- అదనపు సమాచారం: చొప్పదండి బీజేపీ ఇన్‌చార్జి

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

### ఆరెపల్లి మోహన్



జన్మదినం: 6-6-1955
విద్యార్హతలు:ఎంకామ్,ఎల్ఎల్‌బీ
స్వగ్రామం: మానకొండూరు
అనుభవం: సర్పంచి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, విప్. 2009లో మానకొండూరు ఎమ్మెల్యే, 2014, 2018లో అక్కడ నుంచే పరాజయం.
- అదనపు సమాచారం: 2019లో బీఆర్ఎస్‌లో చేరిక, టికెట్ ఆశించి భంగపడి కమలం గూటికి.

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

# బారీకి రాష్ట్రస్థాయిలో చోటు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లారీ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బారీని రాష్ట్రస్థాయి లా రీ యజమానుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన స మావేశంలో బారీని ఎన్నుకున్నారు. ఆయనను నాయకులు, లారీ యజమానులు అభినందించారు. లారీ యజమానుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా పాటుపడతానని బారీ పేర్కొన్నారు.

## వాషింగ్ మిషన్ వితరణ



మిషన్ అందిస్తున్న ప్రతినిధులు

గోదావరిఖనిటౌన్: స్థానిక లక్ష్మీనగర్‌లోని వాసవీమాత, దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈశ్వర కృప వృద్ధాశ్రమానికి శనివారం వాషింగ్ మిషన్, వాటర్ ప్యూరిఫయర్ మిషన్, చీరలు అందజేశారు. అనంతరం దుర్గామాత మండపం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎ.కృష్ణ, జి.వెంకటేశ్, బి.అనిల్, ఆనంద్, కైలాసం, నాగలక్ష్మి, శివసత్యవతి, మాధవి రాజశేఖర్, వెంకటేశ్, వృద్ధాశ్రమ డైరెక్టర్‌లు పీటీ స్వామి, గంట సత్తయ్య, మాధవరెడ్డి, జూపాక సత్యనారాయణ, ఎ.రామచంద్రారావు తదితరులు పాల్గొన్నారు.



## బొగ్గుబాయి వార్తలు

### ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



గోదావరిఖని: సద్దుల బతుకమ్మ వేడుకలు సింగరేణి ఆర్జీ–1 ఏరియాలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జీఎంకాలనీ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. జీఎం చింతల శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మితోపాటు అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

### డైరెక్టర్(పా)కు పరామర్శ



గోదావరిఖని: సింగరేణి డైరెక్టర్(పా) బలరాంను సింగరేణి అధికారుల సంఘం నాయకులు ఆది వారం పరామర్శించారు. బలరాం తండ్రి ఇటీవల మృతిచెందారు. దీంతో అధికారులు ఆయన స్వస్థలానికి చేరుకుని ఆయన తండ్రి హంన్యా చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. అధికారుల సంఘం నాయకులు పానగోటి శ్రీనివాస్, ఎస్.జక్కారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్:పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ సారథ్యంలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, వచ్చేఎన్నికల్లో బీఆర్ఎస్‌కే అండగా నిలిచి మళ్లీ కేసీఆర్‌నే సీఎంగా చేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో పలు పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పాలనలో పల్లెలు, పట్టణాలు అధ్వానంగా ఉన్నాయని, వాటిని అభివృద్ధి పథంలోకి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఎమ్మెల్యే అన్నారు. ప్రతీఇంటికి లబ్ధి చేకూరేలా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కౌన్సిలర్ ఇల్లందుల కృష్ణమూర్తి, నాయకులు సరేశ్, మొబిన్, శ్రీధర్, పైడ రవి, తబ్రేజ్, ఖదీర్, రవి, సంతోష్, జావేద్ పాల్గొన్నారు.

# అకాడ.. సాహస విన్యాసాలకు ప్రతీక


శిక్షణ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్(ఫైల్)


విన్యాసాలు ప్రదర్శిస్తున్న మంత్రి ఈశ్వర్(ఫైల్)


శిక్షణ ఇస్తున్న వస్తాదు

- యుద్ధ కళానైపుణ్యానికి ఆయుధాలే సాక్షి
- ఒళ్లుగగుర్పొడిచే వీరోచితమైన విన్యాసాలు
- అకాడతో ఎమ్మెల్యేలుగా ఎదిగిన సింగరేణి ఉద్యోగులు
- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ కూడా అకాడ వస్తాదే..

కోల్‌సిటీ(రామగుండం):గోదావరిఖనిలో దసరా అంటేనే గుర్తొచ్చేది అకాడ.. ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు.. వస్తాదుల వీరోచిత ప్రదర్శనలు ఔరా అనిపిస్తాయి. ఈ యుద్ధ కళానైపుణ్యానికి 'ఖని' కళాకారులు జీవం పోస్తున్నరు. పూర్వీకుల యుద్ధ కళానైపుణ్యానికి కత్తులు, కర్రలు, ఖాంద, డాల్, తల్వార్, బర్చి, విష్ణుచక్రం, రంపె, బీచ్‌వా, స్టార్స్, పట్టా, పంజా, జంబియా, త్రిశూలం, హంటర్ సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. వీరోచిత పోరాటరీతులను ఈ దసరా పండుగ సందర్భంగా వస్తాదులు, కళాకారులు అకాడ సాహస విన్యాసాలు ప్రదర్శించడానికి సర్వసన్నద్ధమయ్యారు.

**ఆయుధ వినియోగం ఓ కళ..**

- రెడ్డిరాజులు, కాకతీయులు, శివాజీ రాచరిక వ్యవస్థలో రాజ్యంపై దండెత్తడానికి కత్తులు, కర్రలు, కాంద, ఈటలు, బర్చి, డాల్, తల్వార్లు, రంపెలు, బీచ్‌వాలు, కాందాలు, స్టార్స్, గొడ్డళ్లు తదితర ఆయుధాలతో ప్రతిదాడి చేసేవారు.
- రాజ్యం, ప్రజల రక్షణ కోసం చేసిన యుద్ధంలో ఆయుధ వినియోగం ఒక కళగా మారింది.
- పూర్వం గ్రామాల్లో దొంగలభయం ఎక్కువగా ఉండేది. వారిని ఎదుర్కోవడానికి ఏర్పాటు చేసిన యువ రక్షక దళాలకు అకాడలోని యుద్ధ కళలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు.
- రాత్రివేళల్లో ఈ దళాలు కాపలాకాస్తుండేవి.
- యుద్ధ కళలు యువతకు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచాయి. కర్రసాము ప్రాముఖ్యతను చాటుకుంది.


అకాడ ప్రదర్శనలో వస్తాదులు, కళాకారులు(ఫైల్)

**శిక్షణ ఇచ్చే గురువే 'వస్తాదు'..**

అకాడలో శిక్షణ ఇస్తున్న గురువును 'వస్తాదు'గా పిలుస్తారు. యుద్ధ కళలను నేర్చుకున్న వస్తాదులు.. దసరాకు నెల రోజుల ముందుగానే బాలబాలికలు, యువతీయువకులకు కత్తి, కర్రసాము, తలపై కొబ్బరికాయ పగులగొట్టడం, కడుపుపై అరటిపండును తల్వార్‌తో కట్ చేయడం లాంటి ఒళ్లుగగుర్పొడిచే వీరోచితమైన విన్యాసాల్లో శిక్షణ పొందుతారు. శత్రువు దాడి నుంచి తప్పించుకునే తీరు, ఆత్మరక్షణ పొందే తదితర అంశాలు నేర్పిస్తారు. ఇలా శిక్షణ పొందిన వారితో వస్తాదులు ఏటా విజయదశమి సందర్భంగా విన్యాసాలు ప్రదర్శిస్తూ వస్తున్నారు. సాహసోపేతమైన ఈ ప్రదర్శన కోసం యువకులు, పిల్లలు పోటీ పడుతుంటారు. ఉద్వేగపూరితమైన వాతావరణంలో యువకులు ప్రదర్శించే సాహసాలను వీక్షించడానికి నగర ప్రజలు కూడా ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొంటారు.

**'ఖని'లో తొలిసారి అకాడ..**

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో తొలిసారి గోదావరిఖనిలోనే అకాడ పురుడుపోసుకుంది.
- దివంగత మాజీ ఎమ్మెల్యే మాలం మల్లేశం జాగృతి కల్చరల్ సొసైటీ ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడంతో ఈ అకాడ కోల్‌బెల్ట్ ప్రజలకు పరిచయమయ్యింది.
- ఆయన స్ఫూర్తితోనే అనేకమంది అకాడ వస్తాదులుగా మారారు.
- శ్రీరాంబాలక్ అకాడ, జై భారత్ హనుమాన్ అకాడ, నేషనల్ మహవీర్ తదితర సంస్థలు అకాడను కాపాడేందుకు కృషి చేశాయి.

**అకాడను బతికించుకుంటాం**



అకాడ కళను బతికించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. ఏటా దసరా సందర్భంగా ప్రదర్శనలు ఇస్తున్నాం. సొంత ఖర్చులతో అకాడ నిర్వహిస్తున్నా. పిల్లలు, యువత అకాడ నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడుతుంది. ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీఒక్కరిపై ఉంది. అకాడను బతికించుకోవడానికి ప్రభుత్వం ముందుకు రావాలి. – మచ్చ శంకర్, వస్తాదు

**మంత్రి కొప్పుల ఈశ్వర్ అకాడ వస్తాదే..**

అకాడ ప్రదర్శనతో ప్రజలను ఆకట్టుకున్న సింగరేణి ఉద్యోగులు మాలం మల్లేశం, కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేలుగా ఎదిగారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ కూడా అకాడ వస్తాదు కావడం విశేషం. సింగరేణిలో ఉద్యోగం చేసిన కొప్పుల ఈశ్వర్ తనదైన శైలీలో అకాడను ప్రోత్సహించారు. స్వయంగా అకాడను కూడా నిర్వహించారు. మాలెం మల్లేశం 'అకాడ మల్లేశన్న'గా పేరొందారు. ఈ పేరుతోనే మాలెం మల్లేశం ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవలో పాలుపంచుకున్నారు.

## పండుగపూట విషాదం

- ఉరివేసుకుని సింగరేణి కార్మికుడి మృతి

గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీలో నివాసముంటున్న రౌతు సాగర్(33) ఉరివేసుకుని ఆదివారం మృతి చెందాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య కథనం ప్రకారం.. మార్కండేయకాలనీలో నివాసం ఉంటూ భూపాలపల్లి కేటీకే–1గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న సాగర్‌కు 2012లో మాధవితో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమారులు. అయితే, ఆరునెలలుగా భార్యభార్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మాధవి ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. తన వల్లనే భార్య ఇంటినుంచి వెళ్లిపోయిందనే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేనిసమయంలో సాగర్ ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నారు.

## బడుగుల అభివృద్ధి ధ్యేయం



పెద్దపల్లిరూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ ముందుకు సాగుతోందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాగినేడు, రాఘవాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన నాయకులు బీఎస్పీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జనాభాలో అధికశాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఈసారి ఎన్నికల్లో ఏకమైతే ప్రత్యర్థులు ఆగమవుతారన్నారు. బడుగులు, మహిళల సంక్షేమం కోసమే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. నాయకులు ప్రభాకర్, రవీందర్, సదానందం, మధుకర్, స్వామిగౌడ్, వెంకటేశ్, అరుణ, రియాజ్, రంజిత్, నర్సయ్య పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ది అవినీతి పాలన

- మాజీ ఎమ్మెల్యేలు విజయరమణారావు, బిరుదు రాజమల్లు


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

పెద్దపల్లిరూరల్: అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌ను బొందపెట్టి, అన్నివర్గాలకు మేలుచేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యేలు విజయరమణారావు, బిరుదు రాజమల్లు కోరారు. మున్సిపల్‌లోని 27, 28వ వార్డులకు చెందిన పలువురు మహిళలు, యువకులు, మైనార్టీలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ మాట్లాడే మాటలకు, చేతలకు పొంతనే లేదన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. వైఎస్సార్ హయాంలో అమలు చేసిన పథకాలను అటకెక్కించారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో చెప్పినట్లు ఆరు గ్యారంటీలు అమలవుతాయని అన్నారు. కౌన్సిలర్ తూముల సుభాష్‌రావు, నాయకులు అబ్దుల్ రజాక్, సయ్యద్ హబీబ్, నయీంబాబా, విజేందర్‌రెడ్డి, రజియొద్దీన్, గౌస్, జుబేర్, చాంద్, ఇంతియాజ్, నిర్మల, పద్మ, హసీనా, అఫ్జల్, శాజీన, ఫాతిమా, శమీంసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఫ్లెక్సీ చించివేతపై ఆందోళన


నిరసన తెలుపుతున్న నాయకులు

ముత్తారం:పోతారంలో గుర్తుతెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల ఫ్లెక్సీని చించివేశబూరు. దీంతో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఆందోళనకు దిగారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఓటమి భయంతోనే తమ పార్టీ ఫ్లెక్సీ చించివేశారని కాంగ్రెస్ శ్రేణులు ఆరోపించారు. దీనిద్వారా శ్రీధర్‌బాబు గెలుపు ఆగదని పేర్కొన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ మేనిఫెస్టో, శ్రీధర్‌బాబు ఆదరణ చూడలేకనే ఫ్లెక్సీలు తొలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెలుకల జితేందర్‌యాదవ్, కిషన్, కాంతయ్య, నెత్తెట్ల రమేశ్, కిరణ్, బత్తుల రాజయ్య, నరేశ్, అనిల్, రాజేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శం కేసీఆర్ పాలన


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చందర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని:అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి దేశానికే దిక్సూచిగా సీఎం కేసీఆర్‌పాలన నిలిచిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. కాంగ్రెస్ నుంచి జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మద్దె వెంకటేశ్‌గౌడ్, కందుల యువసేన సభ్యులు గాజుల ప్రశాంత్, జగన్‌మోహన్‌రెడ్డితోపాటు పలువురు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి చందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, మేనిఫెస్టో నచ్చి పెద్దసంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు. సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నేత కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుర్ర నూకరాజు, గీట్ల శంకర్‌రెడ్డి, మండ రమేశ్‌గౌడ్, దొమ్మేటి వాసు, దాసరి శ్రీనివాస్, ఆముల సరన్, కంది చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**సబ్బండ వర్గాల కోసం పాటుపడేది బీఆర్ఎస్**

రామగుండం:సబ్బండ వర్గాల సంక్షేమానికి పాటుపడేది బీఆర్ఎస్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ప్రజలు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మద్దె వెంకటేశ్‌గౌడ్, గాజుల ప్రశాంత్, జగన్‌మోహన్‌రెడ్డి, గూడ నితిన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నేరెళ్ల అజయ్‌గౌడ్, చల్లా సిద్ధార్థరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు బీఆర్ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. చేరికలకు సహకరించిన బీఆర్ఎస్ ప్రతినిధులు గీట్ల శంకర్‌రెడ్డి, మండ రమేశ్‌గౌడ్, దొమ్మేటి వాసు, దాసరి శ్రీనివాస్, ఆముల సరణ్‌కుమార్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు.

# సమస్యలపై నిరంతర పోరాటం


వ్యాపారులకు నమస్కరిస్తూ ముందుకు సాగుతున్న మక్కాన్‌సింగ్ ఠాకూర్

గోదావరిఖని: సద్దుల బతుకమ్మ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదివారం స్థానిక లక్ష్మీనగర్‌లో పర్యటించారు. వ్యాపారులను కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ కుటుంబాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, ఎండీ ముస్తఫా, గట్ల రమేశ్, తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు, కుడుదల శివ, వెంకటరమణ, మాలెం మధు తదితరులు ఉన్నారు.

**కాంగ్రెస్‌లో యువకుల చేరిక**

మహాకవిపోతనకాలనీకి చెందిన పలువురు యువకులు దుర్గానగర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాకూర్ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, 27వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కల్వల రంజిత్ ఆధ్వర్యంలో గోదారి సందీప్ కుమార్, అఆయన అనుచరులు పార్టీలో చేరారు.

**చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు**

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని గ్లోరియస్ మినిస్ట్రీస్ చర్చిలో మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. కాగా, 39వ డివిజన్ ఖాజిపల్లికి చెందిన సుమారు 200 మంది మేకల పోశం, దేవేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఫోన్ అప్పగింత

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన మేడి సతీశ్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. అయితే, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ చిరునామాను ఎస్సై– 2 అశ్విని కనుక్కొని ఆదివారం సతీశ్‌కు అప్పగించారు. ఈనెల 19న సతీశ్ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. పోలీసుల సూచన మేరకు మీసేవ ద్వారా సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎస్సై అశ్విని సెల్‌ఫోన్ వెతికి పట్టుకుని సతీశ్‌కు అప్పగించారు.